# పెద్దమనిషి

★

వైజాగ్‌లో పనిచూసుకుని రైల్వే స్టేషనుకు వచ్చాను. నిజాముద్దీన్ లింక్ ఎక్స్‌ప్రెస్ అప్పుడే వెళ్ళిపోయిందని తెలిసింది. వాచీ చూసి గతుక్కుపడ్డాను. అది గంట వెనక్కు ఉన్నట్లు అప్పుడే తెలిసింది. కరెక్టు టైం చూసుకుని ముందుకు తిప్పాను. 'కీ' ఇచ్చేసరికి వాచీ పని చేయడం ప్రారంభించింది. అప్పుడు మనసు కుదుటపడింది. బ్రైన్ సక్రమంగా పనిచేసినట్లు అనిపించింది, రాయపూర్ పాసింజరు నాలుగు గంటలకు బయలుదేరుతుందని ఎన్‌క్వైరీ చేసి తెలుసుకున్నాను.

టికెటు తీసుకుని పాసింజరు ఎక్కాను. కాస్త నడుం వాల్చాను. ట్రైన్ లైట్లు వెలిగాయి. కాస్త కళ్ళు తెరచి చూసాను. జనం ఒక్కొక్కరే ఎక్కుతున్నారు. లేబరు కొంతమంది తమ సామాన్లతో కంపార్టుమెంటు నింపేసారు. కాలక్షేపానికైనా ఎవరూ దొరకరేమో అనిపించింది. కొంతమంది వైజాగ్‌లో సామాన్లు కొని ఇంటికి తీసుకుపోతున్నారా అనిపించింది. కొంతమందిని చూస్తే దుర్వాసనతో పాటు కడుపు తిప్పుతుంది. ఇంకా వాళ్ళతో యేం మాటలు అనిపించింది. ఎందరు ఎక్కినా పుష్పక విమానంలా ఇంకా ఖాళీ ఉంటునే ఉంది.

ఇంతలో మధ్యవయస్కుడైన మనిషి కనిపించాడు. అతన్ని చూసేసరికి ప్రాణం వచ్చినట్లు అనిపించింది నాకు. కాస్త చోటు చేసి జరిగాను. అతడు నాప్రక్కనే కూర్చున్నాడు. "ఎంత వరకు?" అని నన్ను ప్రశ్నించాడు. "పార్వతీపురం" అని ముక్తసరిగా జవాబు చెప్పాను. తరువాత "మీరు?" అని నేను ప్రశ్నించాను.

"మీకు కంపెనీగా ఉంటాను లెండి" అని సమాధానం చెప్పాడు.

అతని బట్టతల ఆకారం చూస్తూఉంటే ఏదో ఆఫీసులో పనిచేస్తున్నాడు అనిపించింది. అదే పనిగా పరిశీలనగా చూసాను. నేనే మాట కలుపుతూ, "మీది ఏ డిపార్టుమెంటు?" అని అడిగాను. అతడు "రెవిన్యూ" అంటూ ముక్తసరిగా సమాధానం చెప్పాడు. ఇంతలో ఒక్కసారి లేచి నిల్చుని "కాస్త, సీటు చూడండి" అంటూ కదిలాడు. నేను "సరే" అంటూ తల ఊపక తప్పలేదు. కంపార్టుమెంటు నిండిపోయింది. కొంతమంది నిలుచోసాగారు. తరువాత క్రిక్కిరిసింది. నాప్రక్క సీట్లో ఎవరు కూర్చోవాలని ప్రయత్నించినా, 'ఉన్నారు' అని చెబుతూ నిరోధించాను. రైలు కూత కూసింది, మెల్లగా కదలడం ప్రారంభించింది. ఇంకా పెద్ద మనిషి లోపలికి రాలేదు ఏమో అని నాకు అనిపించింది.

మనుషులను త్రోసుకుంటూ ఆ పెద్దమనిషి వచ్చాడు. ఆత్రంగా నా ఒడిలో కూర్చుండిపోబోయాడు. "కాస్త చూసుకోండి" అని అన్నాను కోపాన్ని దిగమింగుతూ. "సారీ" అంటూ తన సీట్లో సర్దుకున్నాడు ఆ పెద్దమనిషి.

రైలు ముందుకు సాగుతుంది. ఆ పెద్ద మనిషికి చోటు యిచ్చినందుకు నాకు తృప్తి అనిపించింది. ఎందుకంటే మాటలు అలా అలా సాగిపోతున్నాయి. టైం కూడా తెలియడం లేదు. విలేజి సర్పంచినుండి అమెరికా ప్రెసిడెంటు రీగన్ వరకు కబుర్లు సాగుతున్నాయి. తరువాత సినిమా కబుర్లు, తరువాత రకరకాల విషయాల గురించి మాట్లాడుతున్నాం. నేను సందేహపడుతూ "మన కంపార్టుమెంటులో ఎంతమంది టికెట్టు తీసిఉంటారు?" అని ప్రశ్నించాను.




"వీళ్ళంతా టికెట్లు తీస్తే మన కెందుకండి ఇంత లోటు బడ్జెట్ ? అసలు దేశమే సుసంపన్నం. అంటే మనదేశం అమెరికా అయిపోదు" అన్నాడు ఆ పెద్దమనిషి. నేను నవ్వేశాను.

పార్వతీపురం టౌను స్టేషను వచ్చింది. నేనూ దిగాను. నా వెంట పెద్దమనిషి కూడా దిగాడు. ప్లాట్ ఫారంమీద అడుగు పెట్టగానే "మీరు టికెట్ తీసుకున్నారా ?" అని నన్ను ప్రశ్నించాడు. "అవును" అంటూ తల ఊపాను నేను. "ఎందుకు వేస్టు! ప్చ్!" అంటూ అడ్డుత్రోవన కదిలాడు. "అవును, నిజమే. ఇటువంటి పెద్ద మనుషులు ఉండడంవల్లే కదా! ఎప్పుడూ మనం లోటు బడ్జెట్టులో ఉంటున్నాం" అనిపించింది నాకు. కడుపుఅంతా తిప్పుతూ వాంతి వచ్చేటట్లు అనిపించింది కూడా!

—బెహరా ఉమామహేశ్వరరావు

# "మా అల్లరి రాజు"

మా రాజుకి 8 సం॥లు వుంటాయి. వాడు చాలా అల్లరి వాడు. భలే చిలిపి వాడు. వాడు అల్లరి, చిలిపి చేష్టలు మా యింటిల్లి పాదినే గాక, ఇంటిప్రక్క వాళ్ళని కూడా నవ్విస్తుంటాయి. ఒకసారేమైందంటే...!

మేము మెదక్ వెళ్ళాము. అక్కడ మా మరదలు చదువుకుంటోంది. తనను బజారు తీసుకెళ్ళడానికి, వాళ్ళ మేనేజరమ్మగారిని పర్మిషన్ అడగాలి మరి. నేను బయలుదేరాను. నాతో బాటే మా రాజుగాడు కూడా నేనూ వస్తానని మారాం చేశాడు. సరేలే-ఆమె కూడా చూసినట్లుంటుందని వెంటబెట్టుక వెళ్లాను.

ఆమె మేడమీద వుంది. మేడపైకి వెళ్లాము. ఇంతలో మా వాడు 'డాడీ... 'ఊ...ఊ...' వ...త్తూం...ది!' అన్నాడు. (అంటే 'నెంబర్ టూ') ఎలా ఏమి చేయడం ? అని ఆలోచిస్తూండగనే వాడు నిక్కర్లో ఆ కాస్త పని చేసేశాడు. అది నిక్కర్లోంచి కిందికి పడేట్టుగా వుంది. నేను వెంటనే జేబులోంచి నా రుమాలు తీసి అందులో దాన్ని మూట కట్టాను. వాడికి నిక్కరు వేశాను. నేను ఆ మూటను, వాడిని బయట పెట్టి, నేను లోపలికి వెళ్ళి ఆమెను కలిసి పర్మిషన్ తీసుకుని, గబగబా బయటకు వచ్చేశాను. ఈ తతంగమంతా ఎక్కడ చూస్తుందోనని - నేను ఆ మూటను తీసుకుని, వాడ్ని తీసుకుని మా మరదలున్న రూముకి వెళ్లాను. మా ఆవిడ, మా మరదలు 'పర్మిషన్ ఇచ్చిందా ?' అన్నారు ఎదురుగా వచ్చి.

'ఆ...పర్మిషన్ ఇచ్చింది. మల్లె పూలూ యిచ్చింది. 'ఇదిగో' అని మా మరదలు చేతిలో పెట్టా ఆ మూటను.

'ఇంకేముంది...ఇంకా రాయమంటారా ?'

జరిగిందంతా చెప్పాను. ఒకటే నవ్వు!

—ప్రవీణ్ మైత్రి.


మన్నికకు, ఆహ్లాదానికి....
పంజు టెక్స్ వారి
♦ మాస్టర్ ♦ ఫాంటెక్స్
ఫైన్ బనియన్లనే వాడండి.
ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.